సాక్షి పల్నాడు

గురువారం । 21 । నవంబర్ । 2024



గ్యాస్ ఆటోలో మంటలు

తాడేపల్లి రూరల్: చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిలో కొలనుకొండ వద్ద బుధవారం వెళ్తున్న ఖాళీ గ్యాస్ సిలిండర్ల లోడు ఆటో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టులో 43.25 టీఎంసీల నిల్వ ఉంది. ఎగువ నుంచి నీటి ప్రవాహం రాకపోవడంతో, దిగువకు నీటిని నిలుపుదల చేశారు.

నరేంద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు



భట్టిప్రోలు : మండలంలోని పెదపులివర్రులో గల బాలాత్రిపురసుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో బుధవారం ప్రాతః కాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

మరణమే శరణమా!

ఈనెల 16న నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న జెట్టి అనూష కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తోటి విద్యార్థి పెన్ కనిపించకపోతే ఆ నెపం తనపై వేశారన్న బాధను తట్టుకోలేక క్షణికావేశంలో తనువు చాలించింది. ఈ ఘటన విద్యార్థుల్లో విషాదం నింపింది.

ఈ నెల 14న రాజుపాలెం మండలంలోని ఓ కళాశాలలో చదువుతున్న కేరళ విద్యార్థిని(19) కళాశాల భవనం ఐదో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చేరిన ఆ విద్యార్థిని ప్రస్తుతం కోలుకుంటుంది. చదువు అబ్బడంలేదని, మొదటి సంవత్సరంలో నాలుగు సబ్జెక్టులు ఫెయిలయ్యాయనని, అందుకే చనిపోవాలనుకున్నానని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది.

మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన ఒంటిపులి కోటి స్వాములు (35) భార్యతో నెలకొన్న మనస్పర్థల కారణంగా పెద్దమనుషులు దూషించారనే మనస్తాపంతో బుధవారం సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్ ఎదుట పురుగుమందు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

- గత వారంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య
- చిన్న చిన్న గొడవలు, మనస్పర్థలకు బలవన్మరణం
- భార్య కేసు పెట్టిందని సత్తెనపల్లి పోలీసు స్టేషన్ ఎదుట బుధవారం ఆత్మహత్య చేసుకున్న భర్త
- జూదంలో డబ్బులు పోగొట్టుకుని ఎంతోమంది తనువు చాలిస్తున్న వైనం
- సమస్యలకు పరిష్కారం ఆత్మహత్య కాదంటున్న మానసిక నిపుణులు

రోజురోజుకూ పెరుగుతున్న ఆత్మహత్యలు
క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటున్న వైనం



సాక్షి, నరసరావుపేట : ఒక్కొక్కరిది ఒక్కో సమస్య. చదవుల్లో ఒత్తిడి, ప్రేమలో వైఫల్యం, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, దీర్ఘకాల అనారోగ్యం, బెట్టింగ్, ఒంటరితనం.. తదితర చిన్నచిన్న కారణాలకే ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సమస్యలు ఎదురైనప్పుడు ఆందోళనకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతిని, క్షణికావేశంతో బలవన్మరణాలకు పూనుకుంటున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమస్యను పంచుకుంటే వారితో చర్చిస్తే పరిష్కారాలు దొరుకుతాయి. అయినా ఒత్తిడికి గురై చావును స్వాగతిస్తున్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, మానసిక ఒత్తిడి అధిగమించే విషయంలో అన్ని వర్గాల వారికి అవగాహన ఉండాలని, ఆత్మహత్య ఆలోచన వచ్చిన మొదటి దశలోనే గుర్తించి తగిన కౌన్సెలింగ్ ఇస్తే చాలామంది ఆ ఆలోచన నుంచి బయట పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని మానసిక వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

పెరుగుతున్న భావోద్వేగ బలవన్మరణాలు

ఇటీవల కాలంలో భావోద్వేగ బలవన్మరణాలు పెరుగుతున్నాయి. తండ్రి కొట్టాడనో, భర్తతో గొడవపడో, భార్య పుట్టింటి నుంచి రాలేదనో తదితర చిన్న కారణాలతోనే చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అప్పటి వరకు బాగున్న వారూ క్షణికావేశంతో ఈ తరహా నిర్ణయాలను తీసుకుంటున్నారు. దీనికి ఉద్రేక మనస్తత్వమే కారణంగా మానసిక నిపుణులు చెబుతున్నారు. మరోవైపు యువత మత్తుపదార్థాలు, బెట్టింగ్ వంటి వ్యసనాలకు అలవాటుపడి సమస్యలను కొనితెచ్చుకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆత్మహత్యకు పాల్పడటం వల్ల తమ కుటుంబ సభ్యులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని గుర్తించడం లేదు. దీని గురించి ఆలోచిస్తే ఆత్మహత్య ఆలోచన నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

కౌన్సెలింగ్‌తో పరిష్కారం



ఆత్మహత్య ఆలోచనతో ఉన్నవారిని, సున్నిత మనస్కులను కొన్ని లక్షణాలను బట్టి ముందే గుర్తించవచ్చు. కౌన్సెలింగ్, మందులు ఇవ్వడం ద్వారా దురాలోచనల నుంచి వారిని బయటకు తీసుకురావచ్చు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే ఆత్మీయులతో పంచుకోవడం ఉత్తమం. క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడటం ఏమాత్రం సరికాదు.

– డాక్టర్ వద్దాది వెంకట కిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

పోలీసు స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న కోటిస్వాములు

సత్తెనపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్ ఎదుట బుధవారం జరిగింది. మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన ఒంటిపులి కోటిస్వాములు (35) సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన తేనె అంకమ్మను 20 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె. కొంతకాలంగా కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు పొడచూపాయి. తేనె అంకమ్మ తన తండ్రి మాటలు విని చీటికిమాటికి పుట్టింటికి వెళ్లి తండ్రిచేత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయిస్తోంది. ఈక్రమంలో భార్య పెట్టిన కేసు విషయంలో సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌కు రావాలని పోలీసులు కోటి స్వాములుకు ఫోన్ చేశారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన కోటి స్వాములును స్టేషన్ బయట గండ్లూరు గ్రామానికి చెందిన పెద్ద మనుషులు శేషయ్య, వెంకట్రావు దూషించడంతో మనస్తాపం చెందిన కోటిస్వాములు పురుగు మందు తాగి మృతిచెందినట్లు మృతుని తల్లి మంగమ్మ విలపిస్తూ చెప్పింది. పురుగు మందు తాగిన కోటిస్వాములును హుటాహుటిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతిలో వేదనాదం



అమరావతి: ప్రథమ పంచారామక్షేత్రం అమరావతిలో ఘంటశాల చంద్రమౌళీశర్మ ఆధ్వర్యంలో బుధవారం వేదపాఠశాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం అమరేశ్వరస్వామి గాలిగోపురం నుంచి వేదపాఠశాల వరకు వేద విద్యార్థులు శోభాయాత్ర నిర్వహించారు. తొలుత బ్రహ్మశ్రీ సత్యనారాయణ అవధాని యజ్ఞశ్రీ పర్యవేక్షణలో గణపతి హోమం, గోపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, మండపారాధనలు, వేదపారాయణలు, దుర్గాసప్తశతి పారాయణం, సూర్య నమస్కారాలు, లక్ష్మీగణపతి హోమ సహిత అవహంతిహవనం, రుద్ర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలతో ప్రారంభోత్సవాలు పూర్తిచేశారు. ఈసందర్భంగా ఘంటశాల చంద్రమౌళీశర్మ మాట్లాడుతూ అమరావతి వేదపాఠశాలలో వంద మందికిపైగా పేద బ్రాహ్మణ విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యాలతో ఉచిత వేద విద్య బోధన, స్మార్త ఆగమ విద్యను అందిస్తామని పేర్కొన్నారు.

వేగంగా పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ

నరసరావుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) కంప్యూటరీకరణ వేగంగా సాగుతోందని ఆప్కాబ్ డీజీఎం, ఉమ్మడి గుంటూరు జిల్లా జీడీసీసీ బ్యాంక్ నోడల్ ఆఫీసర్ సిహెచ్‌ఆర్‌సీఎస్ బాలాజీరావు చెప్పారు. పట్టణంలోని జీడీసీసీ బ్యాంక్‌ను బుధవారం ఆయన సందర్శించారు. జిల్లాలో 60 పీఏసీఎస్‌లు ఉన్నాయని, 28 సంఘాలలో ఇప్పటికే కంప్యూటరీకరణ పూర్తయిందని పేర్కొన్నారు. పలు సొసైటీలను సందర్శించి కంప్యూటరీకరణ పనులను పరిశీలించారు. ఆయన వెంట జీడీసీసీ బ్యాంక్ పల్నాడు జిల్లా జనరల్ మేనేజర్ అజయ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'పాఠశాలల వేళల మార్పు సరికాదు'

సత్తెనపల్లి: రాష్ట్రంలో పాఠశాలల పనివేళలు మార్చడం సరికాదని ఎస్టీయూ ఏపీ అధ్యక్షుడు ఎస్.ఎం.సుభాని పేర్కొన్నారు. సత్తెనపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పని వేళలను సాయంత్రం ఐదు గంటల వరకు పొడిగించడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ఇది అశాస్త్రీయ విధానమని, దీనిని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలన్నీ డిమాండ్ చేస్తున్నాయని వెల్లడించారు. పనివేళల పొడిగింపు విద్యార్థుల మానసిక పరిస్థితి, సంసిద్ధత, అభ్యాసనం, బోధనతో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు.

శ్రీలక్ష్మి అమ్మ హుండీ ఆదాయం రూ.23 లక్షలు



దుర్గి: అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.23,87,102ల ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణ అధికారి సైదమ్మబాయి తెలిపారు. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో 63 రోజుల పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల గణనకు హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రశీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం, జిమ్ లీజుకు టెండర్లు ఆహ్వానం



నరసరావుపేట: స్థానిక డీఎస్ఏ (కోడెల శివప్రసాదరావు) స్టేడియంలోని ఇండోర్ స్టేడియం(షటిల్ కోర్టులు), జిమ్‌ను లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) పి.నరసింహారెడ్డి బుధవారం వెల్లడించారు. టెండర్ ఫారాలు ఈనెల 25 నుంచి డీఎస్‌డీఏ కార్యాలయంలో లభిస్తాయన్నారు. ఈనెల 29లోగా ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తున్నామన్నారు. 30వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు టెండర్లను తెరుస్తామని, మరిన్ని వివరాలకు 87126 22574ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన ఉండాలి



నరసరావుపేటటౌన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ చెప్పారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మున్సిపల్ బాలుర పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహ నిరోధక చట్టం, విద్యా హక్కు, బాల కార్మిక నిర్మూలన చట్టాల గురించి వివరించారు. ఏదైనా సమస్యలు ఎదురైతే మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల, టూటౌన్ ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోపణలు వస్తే సహించేది లేదు

సాక్షి ఎఫెక్ట్

నరసరావుపేటటౌన్: అవినీతి ఆరోపణలు వస్తే సహించేది లేదని డీఎస్పీ కె.నాగేశ్వరరావు సిబ్బందిని హెచ్చరించారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది అవినీతిపై 'ఖాకీల కలక్షన్ల పర్వం' అన్న శీర్షికతో బుధవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డీఎస్పీని ఆదేశించినట్లు సమాచారం. దీంతో డీఎస్పీ బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రూరల్ స్టేషన్‌తోపాటు వన్‌టౌన్, టూటౌన్ సీఐలతో సమావేశం నిర్వహించారు. మరో మారు అవినీతి ఆరోపణలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలికల ఆత్మహత్యాయత్నంపై సుమోటోగా విచారణ

- జిల్లా యంత్రాంగం రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలి
- ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశం
- పద్మావతి ఎదుట నిజాలు వెల్లడించిన విద్యార్థినులు



సత్తెనపల్లి బాలికల వసతి గృహంలో ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న బత్తుల పద్మావతి

సత్తెనపల్లి: ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థినుల ఘటనను సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. సత్తెనపల్లి వెంకటపతినగర్‌లోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని మంగళవారం రాత్రి ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పద్మావతి మాట్లాడుతూ విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం ఘటనపై జిల్లా యంత్రాంగం రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థినులు వెల్లడించిన విషయాలు విని ఆమె ఆశ్చర్యపోయారు. 250 మంది విద్యార్థినులకు ఒకే ఒక్క వాష్ రూము ఉందని, మిగిలినవి సెప్టిక్ ట్యాంకు నిండి నిరుపయోగంగా ఉండటం వల్ల దుర్గంధం వెదజల్లుతూ ఇబ్బందిగా ఉంటుందని, దానివల్ల కొంత మంది విద్యార్థినులు కళాశాలకు వెళ్లిన తరువాత కాలకృత్యాలు తీర్చుకుంటున్నారని, మరుగుదొడ్డి ఒకటే ఉండటం వల్ల కొంత మంది రెండు రోజులకొకసారి స్నానం చేస్తున్నామని విద్యార్థినులు పద్మావతి ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా లేకపోవడం, స్టాక్ రిజిస్టరు సరిగా నిర్వహించకపోవడం, కనీసం మెనూ చార్ట్ కూడా ప్రదర్శించకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. హాస్టల్ పరిసరాల్లో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయని, నాసిరకం కూరగాయలతో ఆహారపదార్థాలు తయారు చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. హాస్టల్లో విద్యార్థులతో కమిటీలు లేకపోవడం సరికాదన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పద్మావతి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థినుల తల్లిదండ్రులతో వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణతో మాట్లాడి విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. హాస్టళ్లలో నెలలో ఒకసారి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఆరోగ్య సూత్రాలు తెలియజేయాలన్నారు. బాలల హక్కుల కమిషన్ విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం ఘటనను సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు. ఆమెతోపాటు పట్టణ సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ సత్యారాణి, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, బాలల పరిరక్షణ కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఏఎస్‌డబ్ల్యూ నిరీక్షణ కుమారి, ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు సీడీపీఓ టి.శ్రీలత, సూపర్‌వైజర్ ప్రమీల ఉన్నారు.

తండ్రీకొడుకుల మధ్య ఎస్పీ సయోధ్య



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

దశాబ్దకాలంగా సాగుతున్న తగవులకు పరిష్కారం

యడ్లపాడు: తండ్రీకొడుకుల మధ్య దశాబ్దకాలంగా నెలకొన్న తగవులకు ఎస్పీ కంచి శ్రీనివాసరావు పరిష్కారం చూపారు. ఇద్దరి మధ్య గ్రామపెద్దల సమక్షంలో బుధవారం సయోధ్య కుదిర్చారు. వివరాల్లోకి వెళితే.. యడ్లపాడు దిగువ ఎస్సీకాలనీకి చెందిన ఎడ్లూరి వెంకట్రావు, ఆయన కుమారుడు నాగరాజుల మధ్య కుటుంబ కలహాలు దశాబ్ద కాలంగా ఉన్నాయి. కొడుకు దురుసు ప్రవర్తనపై పలుమార్లు వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కోర్టునూ ఆశ్రయించాడు. చివరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఈనెల 18న జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లి ఎస్పీకి విన్నవించాడు. దీంతో ఎస్పీ కంచి శ్రీనివాసరావు విచారణ నిమిత్తం బుధవారం వెంకట్రావు గృహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తాను, భార్య, కొడుకు, కోడలు, మనుమలంతా కలిసి ఒకే ఇంట్లోనే ఉంటున్నామని, కొడుకు వల్లే గతంలో తాను అప్పులపాలైనట్లు అధికారులకు విన్నవించాడు. తనకు కూడు పెట్టకపోగా, ఆస్తి ఇవ్వాలంటూ తనపై దాడి చేస్తూ ఇంటి నుంచి గెంటివేసే యత్నం చేస్తున్నాడంటూ చెప్పాడు. 2022లోనే యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో నాగరాజుపై కేసు నమోదైన విషయాన్ని ఎస్పీకి గుర్తు చేశాడు. నాన్న మద్యానికి బానిసై అప్పులు చేశాడని, తాను కొత్తగా ఇల్లు నిర్మించుకునేందుకు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి వెనుక ఖాళీ స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తూ తనపై ఆరోపణలు చేస్తున్నాడంటూ నాగరాజు ఎస్పీకి వివరించాడు. దీంతో ఎస్పీ నాగరాజును సున్నితంగా మందలించారు. తల్లిదండ్రులపై ఆరోపణలు తగవని సూచించారు. తండ్రిపై దాడి నేరమని, ఇకపై ఇలాంటివి చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తండ్రీకొడుకుల మధ్య సయోధ్య కుదిర్చారు. తండ్రిని ఇబ్బంది పెట్టకుండా చూసుకుంటానని, ఆలనాపాలనా చూసుకుంటానని గ్రామపెద్దల సమక్షంలో నాగరాజును ఎస్పీ ఒప్పించారు. నాగరాజు ఇల్లు నిర్మించుకునేందుకు సహకరించాలని సూచించారు. ఓ సామాన్య వ్యక్తి కుటుంబ సమస్యపై చొరవ చూపి పరిష్కరించిన ఎస్పీని గ్రామపెద్దలు అభినందించారు. ఎస్పీ వెంట చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్ఐ వి.బాలకృష్ణ ఉన్నారు.

ఫిబ్రవరి నాటికి 46 వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు

నరసరావుపేట: జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాకు 94,512 కుళాయి కనెక్షన్లు మంజూరయ్యాయని, ఫిబ్రవరి 2025 నాటికి 46,316 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు అందించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా నీరు, పారిశుద్ధ్య మిషన్ (జల్ జీవన్ మిషన్) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.3.87 కోట్లతో ప్రణాళికను ఆమోదించామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబరు 10 మానవ హక్కుల దినోత్సవం వరకు పరిశుభ్ర శౌచాలయాల ఆవశ్యకత తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో విశిష్ట సేవలు అందించిన నలుగురు క్లాప్ మిత్రలకు సన్మానం చేశారు. టాయిలెట్ ఫర్ డిగ్నిటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ విజయకుమార్, జిల్లా భూగర్భ జల అధికారి శ్రీనివాసరావు, సీపీవో శ్రీనివాసమూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకటరెడ్డి, డీపీవో విజయభాస్కరరెడ్డి, డీఆర్డీఏ పీడీ బాలునాయక్, డీఎంహెచ్‌ఓ రవి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

సనాతన వైదిక ధర్మం ఎంతో గొప్పది



శంకర మఠంలో భక్తులకు ఆశీస్సులందిస్తున్న శ్రీశ్రీవిదుశేఖర భారతీ స్వామి

- శ్రీశ్రీ విదుశేఖర భారతీ స్వామి అనుగ్రహ భాషణం
- పట్టణంలో సాగిన విజయ యాత్ర
- వేదభారతీ వసతి గృహాన్ని ప్రారంభించిన స్వామి



శారదాంబ అమ్మవారి సన్నిధిలో విదుశేఖర స్వామి

నరసరావుపేట ఈస్ట్: దేశంలో అనాదిగా కొనసాగుతున్న హిందూ ధర్మాన్ని సనాతన వైదిక ధర్మంగా గుర్తించాలని శృంగేరీ శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి శ్రీవిదుశేఖర భారతీ స్వామి తెలిపారు. శ్రీవిదుశేఖర స్వామి విజయ యాత్రలో భాగంగా బుధవారం రాత్రి పట్టణంలోని శ్రీశృంగేరీ శంకర మఠానికి చేరుకున్నారు. వేద పండితుల స్వాగత వచనాల మధ్య శంకర మఠానికి విచ్చేసిన స్వామి మఠం ఆవరణలోని శారదాంబ అమ్మవారిని దర్శించుకొని హారతి సమర్పించారు. అలాగే శ్రీశంకర చంద్రమౌళీశ్వర స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు పాదుకా పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విదుశేఖర స్వామి అనుగ్రహ భాషణ చేశారు. ప్రస్తుతం మనం పిలుచుకుంటున్న హిందూ ధర్మానికి మరో పేరు సనాతన వైదిక ధర్మమని అభివర్ణించారు. ఇది మన ధర్మం గొప్పతనాన్ని సూచిస్తున్నదని వివరించారు. ప్రపంచం దేని ద్వారా ధరింపబడుతుందో దానిని ధర్మం అంటారని తెలిపారు. ధర్మం, అధర్మం ఈ రెండూ నేడు మనిషిని నడిపిస్తున్నాయని, ఆశాజీవిగా మనిషి అన్నీ తనకు అనుకూలంగా కావాలనుకుంటూ స్వార్థంతో వ్యవహరిస్తాడని తెలిపారు. అయితే ధర్మం ఏదివ్వాలో దానినే అందిస్తుందని తెలిపారు. అనుగ్రహ భాషణ అనంతరం స్వామి రామిరెడ్డిపేటలో కొత్తగా నిర్మించిన వేద విద్యార్థుల వసతి గృహం వేదభారతీ గృహాన్ని ప్రారంభించారు. వేదభారతి వద్దకు చేరుకున్న స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి అక్కడే బస చేశారు. ఈ కార్యక్రమాలలో నరసరావుపేట జమిందార్ కొండలరావు బహదూర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త పాల్గొన్నారు.

నేటి స్వామి పర్యటన ఇలా..

విదుశేఖర భారతీ స్వామి గురువారం ఉదయం పాతూరులోని శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. శ్రీభీమలింగేశ్వరస్వామి నగరోత్సవానికి సిద్ధం చేసిన నూతన దివ్య రథాన్ని ప్రారంభించి పాత శంకర మఠంను సందర్శిస్తారు. అక్కడి నుంచి కోటప్పకొండ చేరుకొని శ్రీత్రికోటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తారు. కోటప్పకొండ నుంచి మిన్నెకల్లు గ్రామానికి చేరుకొని అక్కడ శ్రీశ్రీభారతీ తీర్థ స్వామి పూర్వాశ్రమ మాతృమూర్తి పేరుతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తారు. తిరిగి శంకర మఠం చేరుకొని భక్తుల పూజలు స్వీకరించి సాయంత్రం 4 గంటల సమయంలో తన విజయ యాత్రను కొనసాగిస్తారు.

దాచేపల్లిలో ఉద్రిక్తత

- టిప్పు సుల్తాన్ ర్యాలీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- చెదరగొట్టిన పోలీసులు

దాచేపల్లి : పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీలో బుధవారం జరిగిన టిప్పు సుల్తాన్ ర్యాలీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓ సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు జెండాలు పట్టుకుని టిప్పు సుల్తాన్ ర్యాలీ చేశారు. కారంపూడి రోడ్డు సెంటర్‌కు ర్యాలీ వస్తున్న క్రమంలో మరో సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఛత్రపతి శివాజీ ఫొటోలు చూపిస్తూ కేకలు వేశారు. దీంతో ఇరువర్గాలు వాగ్వివాదానికి దిగారు. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఒక వర్గం మరోవర్గంపై కవ్వింపు చర్యలకు పాల్పడుతుండటంతో పోలీసులు అందరినీ అక్కడి నుంచి పంపించారు.